# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఓటరు జాబితా పేరులో అక్షర దోషాలు వున్నప్పటికీ ఓటు వేయడానికి అనుమతించాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.**

**2.** **న్యాయ్ పత్ర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది.**

**3.** **రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రజలను కోరారు.**

4. **తిరుమల తిరుపతి దేవస్థానం మొట్టమొదటిసారిగా ఉగాది తెలుగు క్యాలెండరును ప్రచురించిందని టీటీడీ కార్య నిర్వాహణ అధికారి ఎవి.ధర్మారెడ్డి తెలియజేశారు.**

**5.** **దూరదర్శన్ తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ కన్నుమూశారు.**

==========================

ఓటరు జాబితాలోని పేరులో అక్షర దోషాలు వున్నప్పటికీ ఓటు వేయడానికి అనుమతించాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. పేరులో అక్షర దోషాలు ఉన్నాయన్న కారణంగా ఓటును నిరాకరించవద్దని పేర్కొంది. ఇందు కోసం ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అనుమతించాలని సూచించింది. ఒక వేళ ఓటరుకు , జాబితాలోని ఫోటోకు సంబంధం లేదని ఎన్నికల అధికారులు భావించిన పక్షంలో ఎన్నికల సంఘం గుర్తించిన ఏదో ఒక గుర్తింపు కార్డును పరిశీలించి ఓటు వేయడానికి అనుమతించాలని కోరింది. ఎటువంటి పరిస్థితులలోనూ ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్త వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

--------------------------

న్యాయ్ పత్ర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులు ఈ రోజు ఢిల్లీలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదనల ప్రకారం ఏటా పంటకు కనీస మద్దతు ధర దాదాపు 30 లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు తదితర హామీలకు ఎన్నికల వాగ్దానాలలో చోటు కల్పించింది.ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూకాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేస్తామనీ, పేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు అందిస్తామనీ తెలిపారు. కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామనీ, కనీస మద్దతు ధర చట్టం తీసుకొస్తామనీ ఆయన వెల్లడించారు.

---------------------------

**Unified Payments Interface-UPI** ద్వారా నగదు జమ చేసే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు భారత రిజర్వ్ బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. 'ప్రస్తుతం నగదు జమ చేసే యంత్రాలలో డెబిట్ కార్డు ద్వారా మాత్రమే నగదు జమ చేసే సౌకర్యం ఉందనీ, కార్డ్ లెస్ లావాదేవీ మాదిరిగా భవిష్యత్తులో **UPI** ద్వారా నగదు జమ చేసేలా మార్పులు చేస్తామనీ తెలిపారు. దీని ద్వారా ఖాతాదారులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన వెల్లడించారు.

---------------------------

తిరుపతి లోకసభ నియోజకవర్గంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు అరుణ్ సింగ్ ప్రజలను కోరారు. తిరుపతిలో బిజెపి నేతలతో ఆయన ఈరోజు సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అవ్వడం ఖాయమనీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వై. ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అరుణ్ సింగ్ పేర్కొన్నారు.

---------------------------

రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో సీట్ల సర్దుబాటు అంశంపై కాంగ్రెస్, సిపిఐ పార్టీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో సిపిఐను బలపర్చటానికి కాంగ్రెస్ పార్టీ అంగీకారం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. దీనిలో భాగంగా గుంటూరు లోక్‌సభ నియోజకవర్గంతో పాటు విజయవాడ పశ్చిమ, విశాఖపట్నం పశ్చిమ, అనంతపురం, పత్తికొండ, తిరుపతి, రాజంపేట, ఏలూరు, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ పార్టీ పోటీ చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం మొట్టమొదటిసారిగా ప్రచురించిన ఉగాది తెలుగు క్యాలెండర్ వచ్చే వారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుందని టీటీడీ కార్య నిర్వాహణ అధికారి ఎవి.ధర్మారెడ్డి తెలియజేశారు. తిరుపతిలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ ఏప్రిల్ 9వ తేదీన తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని భక్తులందరూ కొనుగోలు చేసేందుకు వీలుగా ఇప్పటికే తిరుమల, తిరుపతిలోని టిటిడి పుస్తక విక్రయ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎండ వేడిమి నుండి రక్షణ కోసం ఏర్పాట్లు చేశామని తెలిపారు. శేషాచల అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామనీ, యాత్రికులు నీటిని పొదుపుగా వాడాలని ధర్మారెడ్డి సూచించారు.

---------------------------

గుంటూరులోని కేంద్ర వస్తు సేవల పన్ను –CGST కమిషనరేట్... The cigaraters and other tobacco products act చట్టం– 2003కి అనుగుణంగా లేని, వినియోగానికి పనికిరాని,పలు బ్రాండ్లకు చెందిన సిగరెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలియచేసింది. నిన్న 1.66 కోట్ల రూపాయల విలువైన 33.30 లక్షల స్టిక్‌లను,గత నెల 21 వ తేదీన 3.21 కోట్ల రూపాయల విలువైన 64.43 లక్షల స్టిక్‌లను స్వాధీనం చేసుకుని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌లో వాటిని కాల్చి వేసినట్లు సామాజిక మాధ్యమంలో పేర్కొంది.

---------------------------

దూరదర్శన్ తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. తెలుగులో తొలిసారి వార్తలు చదివిన శాంతి స్వరూప్...పదేళ్లపాటు టెలీప్రాంప్టర్ లేకుండా పేపర్ చూసి వార్తలు చదివి చెరగని ముద్రవేశారు. 1983 నవంబర్ 14 నుంచి దూరదర్శన్‌లో వార్తలు చదవడం ప్రారంభించిన ఆయన స్పష్టమైన ఉచ్ఛారణతో,ఆకట్టుకునే శైలితో, వాచికంతో వార్తలను అందించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు.ఎంతో మంది ప్రముఖులతో ఇంటర్వ్యూలు,సాహితీ కార్యక్రమాలు కూడ నిర్వహించిన శాంతి స్వరూప్ 2011లో పదవీ విరమణ చేసేవరకు దూరదర్శన్ లో సేవలందించారు. జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు టి.వి, నాటక, చలనచిత్ర, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు సాహితీ వేత్తలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

---------------------------

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ –సీబీఎస్సీ జాతీయ విద్యా విధానం–2020కి అనుగుణంగా మూల్యాంకనంలో మార్పులను ప్రవేశపెట్టింది. ఈ విధానం మరిన్ని సామర్థ్య–ఆధారిత ప్రశ్నలపై ఆధారపడి ఉంటుందని తెలిపింది. సవరించిన మార్గదర్శకాల ప్రకారం, 11, 12 తరగతులలో బహుళైచ్ఛిక ప్రశ్నలు, కేస్ ఆధారిత ప్రశ్నలు, సోర్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ ప్రశ్నలు, మరేదైనా సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలను 40 శాతం నుండి 50 శాతానికి పెంచారు. మరోవైపు, 2024–25 విద్యా సంవత్సరంలో 9, 10 తరగతులకు సంవత్సరాంతపు పరీక్షల ప్రశ్నా పత్రాలలో ఎటువంటి మార్పులు చేయలేదని సీబీఎస్సీ ప్రకటించింది.

---------------------------

రానున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను గుంటూరు జిల్లాలో త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. జిల్లాలోని 1915 పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, మౌలిక సదుపాయాల కల్పన ఇప్పిటికే పూర్తి కావచ్చింది. ఈ పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులుగా నియమితులైన ప్రభుత్వోద్యోగులకు ఈ నెల 15, 16వ తేదీలలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటానికి జిల్లా కలెక్టర్ ఎమ్.వేణుగోపాలరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ శిక్షణా కార్యక్రమమంలో జిల్లా వ్యాప్తంగా 4600 మంది ప్రభుత్వోద్యోగులకు పోలింగ్ కేంద్రాలలో నిర్వహించవలసిన విధులపై శిక్షణ అందించనున్నారు.

---------------------------

జాతీయ స్థాయి కళాశాలల్లో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే జెఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు రాసే అభ్యర్థులకు జాతీయ పరీక్షల సంస్థ–ఎన్టీఏ సూచనలు జారీ చేసింది. పరీక్ష రాసే సమయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. పరీక్ష డేటా అనాలసిస్ పూర్తయిన తర్వాత కూడా చర్యలు తప్పవని పేర్కొంది. పరీక్ష స్ఫూర్తిని దెబ్బతీసేలా ఎలాంటి ప్రయత్నం చేసినా ఆయా అభ్యర్థులను ఈ ఏడాది మాత్రమే కాకుండా భవిష్యత్తులోనూ పరీక్షకు అనుమతించమనీ, అంతేకాకుండా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలియజేసింది.

---------------------------

రాష్ట్రంలో రాగల 24 గంటల్లో పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఈరోజు 109 మండలాల్లో తీవ్ర వడగాలులు, 206 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. రేపు 115 మండలాల్లో తీవ్ర వడగాలులు, 245 మండలాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. మధ్యాహ్నం వేళ వృద్ధులు, పిల్లలు బయటకు వెళ్ళరాదని వాతవరణ శాఖ సూచిస్తోంది.

====================